సాక్షి ప్రకాశం

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



పేదలపై ఎందుకింత కళ్లమంట?

గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నేత్ర పరీక్షలు చేసే ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలను కూటమి ప్రభుత్వం మూతవేసింది. దీంతో నేత్ర పరీక్షలు చేయించుకో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో..



రెచ్చగొట్టి.. కేసులు పెట్టి

గణేష్ నిమజ్జన వేడుకల్లో పసుపు దండు బరితెగించింది. వైపాలెం, అర్ధవీడు మండలాల్లో టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

38.1/28.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.



మెడికల్ కాలేజీలను త్వరగా ప్రారంభించాలి

మెడికల్ కళాశాలను ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలి. దీంతో నీట్ రాసిన విద్యార్థులకు కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశముంది. ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో నేను క్వాలిఫై అయ్యాను. మార్కాపురంలో మెడికల్ కాలేజీ అందుబాటులో ఉన్నట్లయితే నేను ఇక్కడే ఉండి చదువుకుంటాను. నాతోపాటు నా స్నేహితులు కూడా పలువురు క్వాలిఫై అయ్యారు. మార్కాపురం మెడికల్ కాలేజీని నీట్ కౌన్సెలింగ్‌లో చేరిస్తే మేము మార్కాపురం మెడికల్ కాలేజీని ఆప్షన్‌గా ఎంచుకుని ఇక్కడే చదువుకుంటాం.

– వెంకటేశ్వరరెడ్డి, నీట్ విద్యార్థి, మార్కాపురం



వైద్య విద్యకు నిరుపేదలను దూరం చేస్తున్నారు



నిరుపేద విద్యార్థులు వైద్యవిద్యను ప్రభుత్వ కళాశాలల్లో చదవకుండా వైద్యవిద్యకే టీడీపీ ప్రభుత్వం దూరం చేయడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను మంజూరు చేసింది. వాటిలో 5 ప్రభుత్వ కళాశాలలు కాగా 12 ప్రైవేటు కళాశాలలు. ఈ 12 వైద్య కళాశాలల్లో కూడా ప్రభుత్వమే నిర్వహిస్తే పేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తుంది. నా కుమారుడు షేక్ మహమ్మద్‌జానీ నీట్ పరీక్షలో జాతీయ స్థాయిలో 6434వ ర్యాంకు సాధించాడు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మా అబ్బాయికి ప్రభుత్వ కళాశాలలో సీటు వస్తుందో, రాదోనని దిగులుగా ఉంది.

– షేక్ దివాన్‌బాషా, నీట్ విద్యార్థి తండ్రి

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జూపూడి



ఒంగోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావును నియమించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటలో తెలిపింది.

అండర్ 14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక నేడు

ఒంగోలు: అండర్ 14 ప్రకాశం జిల్లా క్రికెట్ బాలుర జట్టు ఎంపిక శనివారం స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాజట్టు అక్టోబరు అనంతపురంలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూ, సొంత కిట్‌తో హాజరుకావాలన్నారు. ఎంపిక సమయంలో తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాఠశాల స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. 2010 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఆసక్తిగల క్రీడాకారులు పూర్తి వివరాలకు కోచ్ సుధాకర్, మొబైల్ 9701022333. కోచ్ చంద్రశేఖర్ మొబైల్ నంబర్ 9246222999లను సంప్రదించాలన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు పీఎం ఉపకార వేతన పథకం

ఒంగోలు: మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం 2024–25 కేంద్రీయ సైనిక బోర్డు, న్యూఢిల్లీ వారు ఉపకార వేతనాలకు అర్హులైన మాజీ సైనికుల పిల్లలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఎం.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీఈడీ, బీబీఏ, బీసీఏ, బి.ఫార్మసీ, బీఏ, ఎల్ఎల్‌బీ వంటి సాంకేతిక, వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన పిల్లలు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హులన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, బాలురకు నెలకు రూ.2500, బాలికలకు నెలకు రూ.3 వేలు చొప్పున మంజూరు చేస్తారన్నారు. అర్హత గల అభ్యర్థులు కేంద్రీయ సైనిక బోర్డు, న్యూఢిల్లీవారి వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేఎస్‌బీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను నవంబరు 30వ తేదీలోగా అప్‌లోడ్ చేసుకోవాలన్నారు.

18న రాష్ట్ర, జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పర్చూరు (చినగంజాం): రాష్ట్ర, జాతీయ క్రీడా పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాల ఆటల పోటీల కార్యదర్శి చింపా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఈనెల 18వ తేదీ బుధవారం కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒంగోలులో ఏబీఎం జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్ తక్రా పోటీల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో ఎంపిక చేస్తారన్నారు. అండర్–14 విద్యార్థులు 2011 జనవరి 1వ తేదీ లోపు, అండర్–17 విద్యార్థులు 2008 జనవరి 1వ తేదీ లోపు, అండర్ 19 విద్యార్థులు 2006 జనవరి 1వ తేదీ లోపు జన్మించి ఉండాలన్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతూ ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తమ పాఠశాల హెచ్ఎం, కళాశాల ప్రిన్సిపాల్ వద్ద నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్‌ని కూడా వెంట తీసుకొని రావాలని ఆయన కోరారు. వివరాలకు 98481 25706, 94406 21579 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ బోధనాంశాల్లో అతిథి (గెస్ట్) అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రకేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ రాజ మోహన్ తెలిపారు. ఏకేయూ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి సూచన మేరకు, రిజిస్ట్రార్ బీ హరిబాబు ఆధ్వర్యంలో దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎం.కాం, ఎంబీఏ, బీపీఎడ్, ఎంపీఎడ్ తదితర కోర్సుల్లో బోధించేందుకు అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థుల నుంచి తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను అటెస్ట్ చేయించి ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ది ప్రిన్సిపాల్, ఏకే యూనివర్సిటీ కాలేజ్, ఒంగోలు, 523001 చిరునామాకు నేరుగా లేదా, పోస్టు ద్వారా పంపాలని చెప్పారు. అవే వివరాలను principalakuongole@gmai.com మెయిల్‌కు పంపాలని సూచించారు. ఈనెల 21న శనివారం కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలను www.akuprakasam.ac.in వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు.

రేషన్ బియ్యానికి రెక్కలు



అధికారం అండతో పశ్చిమ ప్రకాశంలో పచ్చ మాఫియా చెలరేగిపోతోంది. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లోకి తరలించి నెల నెలా రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అడ్డుకోవాల్సిన సివిల్ సప్లయీస్ శాఖ అధికారులే అక్రమాలకు అండగా నిలుస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ శాఖలన్నీ పచ్చ నేతలకు సాగిలపడి వెన్నుదన్నుగా ఉంటున్నాయి. పైగా అడ్డుపడే ప్రతిపక్ష మద్దతుదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది.

- పశ్చిమ ప్రకాశం టు కృష్ణపట్నం పోర్టు
- అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి
- కూటమి నేతల కనుసన్నల్లోనే బియ్యం అక్రమ రవాణా
- స్టాక్ పాయింట్ల నుంచే నేరుగా తరలింపు
- మండలానికొక టీడీపీ నేత ద్వారా సేకరణ
- రాజీనామాలు చేయాలని డీలర్లపై ఒత్తిడి

అక్రమ రవాణా ఇలా...

మార్కాపురం ప్రాంతంలో కొనుగోలు చేసిన బియ్యాన్ని మార్కాపురం, తర్లుపాడు, కంభం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని లారీల ద్వారా కృష్ణపట్నం పోర్టుకు చేరుస్తున్నారు. మరికొంత బియ్యాన్ని కోస్తా జిల్లాలకు చేర్చి అక్కడి నుంచి పోర్టులకు తరలించి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. రేషన్ డీలర్ల నుంచి వ్యాపారులు బియ్యాన్ని కొనుగోలు చేసి పట్టణ శివారు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచి రాత్రిపూట తరలిస్తున్నారు. ఇలా తరలించిన బియ్యాన్ని నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లో పాలిష్‌పెట్టి మళ్లీ సన్న బియ్యంగా ప్రజలకు అమ్ముతున్నారు. డీలర్ల నుంచి బియ్యం అక్రమ రవాణా చేసే ఏజెంట్లు కిలో రూ.10 నుంచి రూ.12లకు కొని ప్రభుత్వానికి లెవీగా.. మార్కెట్లో నాణ్యమైన బియ్యంగా.. విదేశాలకు ఎగుమతి చేస్తూ ఒక్కొక్కరు నెలకు రూ.లక్షల్లో సంపాదించుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని రవ్వగా మార్చి విక్రయిస్తున్నారు. ఈ బియ్యపు రవ్వను బొంబాయి రవ్వలో కలుపుతున్నారు.

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలకు రేషన్‌బియ్యం అక్రమ రవాణా ప్రధాన ఆదాయ మార్గంగా మారింది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో టీడీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు రేషన్ బియ్యం వ్యాపారంలో తలమునకలయ్యారు. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు రేషన్ బియ్యం సేకరణకు మండలానికి, పట్టణాలకు టీడీపీ నాయకులను ఏజెంట్లుగా నియమించారు. నేరుగా స్టాక్ పాయింట్ల నుంచే నాణ్యమైన బియ్యాన్ని లారీల్లోకి లోడ్ చేసి, అక్కడి నుంచి కృష్ణపట్నం పోర్టుకు పంపుతున్నారు. వీరికి అనుకూలంగా ఉన్న కొన్ని రైస్‌మిల్లుల్లో బియ్యాన్ని పాలిష్ పట్టి నాణ్యత పెంచి అమ్ముతున్నారు.

రూ.10కి కొని.. రూ.25కు అమ్మకాలు

కార్డుదారులతో పాటు నేరుగా రేషన్ డీలర్ల నుంచి రూ.10లకు కొనుగోలు చేస్తున్నారు. ఇదే బియ్యాన్ని పాలిష్ పట్టించి ప్రభుత్వానికి రూ.25 లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఒక వ్యక్తికి నెలకు 5 కిలోల బియ్యాన్ని కిలో రూపాయి ప్రకారం సబ్సిడీ రూపంలో అందిస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం బయట సుమారు రూ.25 చెల్లించి కొనుగోలు చేస్తుంది. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో పేదలకు చెందాల్సిన బియ్యం లారీల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్తున్నాయి. మార్కాపురం, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెంలో పౌరసరఫరాల శాఖ గోడౌన్లు ఉన్నాయి. మార్కాపురం గోడౌన్ ద్వారా మార్కాపురం పట్టణ, రూరల్, పెద్దారవీడు, పెద్దదోర్నాల, తర్లుపాడు మండలాల్లోని రేషన్ దుకాణాలకు, గిద్దలూరు గోడౌన్ ద్వారా గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలకు, కంభం గోడౌన్ నుంచి కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలకు, యర్రగొండపాలెం గోడౌన్ ద్వారా యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

బయట మార్కెట్లో రూ.70లకు విక్రయాలు

టీడీపీ నేతలు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కొంత మేర ప్రభుత్వానికి లెవీ కింద సరఫరా చేస్తున్నారు. అత్యధికంగా బయట మార్కెట్లో విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో 100 కిలోల బియ్యం బస్తా రూ.6500 నుంచి రూ.7 వేల మధ్య ఉండడంతో సబ్సిడీ బియ్యానికి డిమాండ్ ఏర్పడింది. విదేశాల్లో కూడా బియ్యానికి డిమాండ్ ఉండడంతో రేషన్ బియ్యాన్ని డబుల్ పాలిష్ పట్టి.. బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి పోర్టుల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

డీలర్లపై రాజీనామా ఒత్తిడి:

ముఖ్యంగా మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, యర్రగొండపాలెం నియోజకవర్గంలో యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాలున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాలు ఉన్నాయి. సుమారు 200కు పైగా రేషన్ షాపులుండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులతో కలిసి డీలర్లను బెదిరించి రాజీనామాలు చేయించారు. అయితే రాజీనామా చేయని డీలర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, గోడౌన్ డీటీలతో బెదిరింపుల పర్వానికి దిగారు. మీపై 6ఏ కేసులు నమోదు చేస్తామని తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులుగా ఉన్న డీలర్లే అధికారులకు టార్గెట్‌గా మారారు. మార్కాపురం పట్టణంలో మొత్తం 30 రేషన్ షాపులుండగా ఇప్పటికే 15 షాపుల్లో డీలర్లను గత నెలలో తొలగించారు. మిగిలిన వారిని తొలగించేందుకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. రాజీనామా చేస్తావా.. కేసులు పెట్టమంటావా.. అంటూ మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో రెవెన్యూ అధికారులు దేశం నేతల మెప్పు కోసం డీలర్లను బెదిరిస్తున్నారు. దీంతో పలువురు డీలర్లు అధికారుల వేధింపులు, బెదిరింపులపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గురువారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు.

అక్రమాలు జరుగుతోంది ఇలా..

కొంత మంది కార్డుదారులు బియ్యం నాణ్యత లేకపోవడంతో తీసుకోకపోగా, మరి కొంత మందికి డీలర్లు ఇవ్వడం లేదు. ఇలా ప్రతి రేషన్ షాపు నుంచి తక్కువలో తక్కువగా సుమారు 100 బస్తాల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్తుంది. డివిజన్‌లోని అన్నీ మండలాల్లో బయోమెట్రిక్ విధానంలో డీలర్లు కార్డుదారుల ద్వారా వేలిముద్రలు వేయించుకుంటున్నారు. చాలా మంది వినియోగదారులు ఈ బియ్యాన్ని తీసుకోవడం లేదు. దీంతో డీలర్లు అక్రమ వ్యాపారులకు బియ్యాన్ని అమ్ముతున్నారు. వారు స్టాక్ పాయింట్‌లో పెట్టుకుని నెలాఖరులో రాత్రిపూట లారీల ద్వారా నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు.

అధికార పక్షం బరితెగింపు



సమావేశానికి హాజరైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, కూటమి కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మేయర్ గంగాడ

- కౌన్సిల్‌లో బలం లేకపోయినా టీడీపీ నేతల ఇష్టారాజ్యం
- కోరం లేకపోయినా ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం
- గతంలో కోరం త్రీ బై ఫోర్త్.. ఇప్పుడే కొత్తగా వన్ బై థర్డ్ అట
- నిబంధనలు మారాయంటూ కమిషనర్ కొత్త పలుకులు
- దామచర్ల దర్పం కోసమే సమావేశం.. పనిలో పనిగా మేయర్ పనులకు ఆమోదం
- పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపై మాత్రం నిజనిర్ధారణ కమిటీ
- ఇదీ ఒంగోలు నగర పాలక సంస్థ సాధారణ సమావేశం తీరు

ఒంగోలు సబర్బన్: టీడీపీ అంటేనే..అంతా మేనేజ్‌మెంట్...చట్టాలు, సెక్షన్‌లు అంటే వారికి లెక్కే లేదు. లేని సెక్షన్‌లను బయటకు తేగలరు...ఉన్న వాటిని మూసేయగలరూ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు నెలలు పూర్తయింది. అయినా ఒంగోలు నగర పాలక సంస్థ సమావేశానికి టీడీపీ తరఫున గెలిచిన ఎంపీగానీ... ఎమ్మెల్యేలుగానీ ఒక్కసారి కూడా హాజరు కాలేదు. టీడీపీ కూటమికి కార్పొరేటర్ల బలం లేకపోయేసరికి మూడుసార్లు కౌన్సిల్ సమావేశాలకు రాకుండా వాయిదా వేసుకున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన కార్పొరేటర్ల కోసం బేరాలు పెట్టారు. ఒంగోలు నగర పాలక సంస్థను వారి చెప్పు చేతుల్లోకి తీసుకోవాలని కుట్రలు పన్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు నగర పాలక సంస్థ సాధారణ సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం మందిరంలో జరిగింది. సమావేశంలో అధికార పార్టీ నాయకులు నిస్సిగ్గుగా.. నిబంధనలకు నీళ్లొదిలి మరీ బరితెగించారు.

కోరం లేకపోయినా కౌన్సిల్ సమావేశం:

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం కోరం లేకపోయినా నిర్వహించి మరీ అజెండాలోని అంశాలను ఆమోదింపజేసుకున్నారు. గతంలో కౌన్సిల్ సమావేశం అంటే ఉన్న సభ్యుల్లో త్రీ బై ఫోర్త్ సమావేశానికి హాజరుకావాల్సి ఉంది. అలా లేకుంటే ఎన్నో సందర్భాల్లో కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేశారు. అలాంటిది కొత్తగా వచ్చిన కమిషనర్ వెంకటేశ్వరరావు ఎప్పుడూ లేని చట్టాలని వెలికితీసి త్రీ ఫోర్త్ కాదు వన్ థర్డ్ ఉంటే చాలు అని 74వ రాజ్యాంగ సవరణ అంటూ కొత్తపలుకులు పలికి కోరం కాకపోయినా ఉన్న సభ్యులు సరిపోతారని నిర్ధారించి మరీ సమావేశం నిర్వహించారు.

ప్రస్తుతం ఉన్న కౌన్సిల్‌లో 36 మంది సభ్యులు ఉంటేనే కోరం:

నిబంధనలను అనుసరించి ఇప్పటి వరకూ జరిగిన కౌన్సిల్ సమావేశాల ప్రకారం 36 మంది సభ్యులు హాజరు కావాలి. అలాంటిది శుక్రవారం జరిగిన సమావేశానికి కనీసం 30 మంది కూడా హాజరుకాలేదు. అదీ కూడా ఎక్స్ అఫీషియో సభ్యులను కలుపుకుంటే. కో ఆప్షన్ సభ్యులు ఉన్నా కూడా కోరం కాలేదు. అసలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ కుమార్‌లు వాస్తవానికి ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అయితే వాళ్లు ముగ్గురూ ఇప్పటి వరకూ ప్రమాణ స్వీకారమే చేయలేదు. అయినా అర్హులేనంటూ నూతన కమిషనర్ వెంకటేశ్వర రావు బూజుపట్టి అటకమీద పడేసిన ఏవో చట్టాలను బయటకు తీసిమరీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.

అజెండాలోని పేదల ఇళ్ల పట్టాలు మినహా అన్నీ ఆమోదమే:

సమావేశంలో అజెండాలోని పది అంశాల్లో ఒకటి మినహా మిగతావన్నీ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో ఆమోదం పొందాయి. అదేంటంటే మొన్నటి వరకు ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న బాలినేని శ్రీనివాస రెడ్డి పేదల పక్షాన ఉండి 25 వేల మందికి ప్రైవేటు భూములు కొనుగోలు చేసిమరీ పట్టాలు ఇచ్చిన అంశాన్ని మాత్రం పక్కన పెట్టారు. ఆ భూముల కొనుగోలు... పట్టాలు ఇచ్చిన తీరుపై ఒక కమిటీని వేసి నిజనిర్ధారణ చేసిన తరువాత నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్మానం చేసి ఆ అంశాన్ని ఆమోదం నుంచి తప్పించారు.

మేయర్ వర్కులకు మాత్రం ఆమోదం..

ఒంగోలు నగర మేయర్ సుజాత స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదింపజేసిన వర్కులకు మాత్రం కౌన్సిల్‌లో ఆమోద ముద్ర వేసుకున్నారు. అడ్డగోలుగా 16 వర్కులు తయారు చేసి వాటి కోసం రూ.90 లక్షల ప్రజాధనాన్ని కేటాయించారు. స్టాండింగ్ కమిటీలో ఉన్న మేయర్ సుజాతతో పాటు వైఎస్సార్ సీపీని వీడి టీడీపీ కూటమిలో చేరిన కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్యతో కలిసి మేయర్ ఆ పనుల్లో 30 శాతం కమీషన్ తీసుకొని మరీ ఇప్పటికే జేబుల్లో వేసుకున్నట్లు సమాచారం. వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు ఇచ్చుకొని మరీ లాభం పొందినట్లు తెలుస్తోంది. ఆ వర్కులకు సంబంధించి కూడా కౌన్సిల్ సమావేశంలో ఆమోదించుకున్నారు.

ట్రాన్స్ కో నూతన ఈఈగా నాగరాజారావు



ట్రాన్స్ కో ఈఈగా బాధ్యతలు చేపడుతున్న నాగరాజారావు

ఒంగోలు సబర్బన్: ట్రాన్స్ కో ప్రకాశం జిల్లా నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ–సివిల్)గా డి.నాగరాజారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈఈగా పనిచేసిన సంజీవ్ రెడ్డి ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి నాగరాజారావు బదిలీపై వచ్చారు. ఆయన 1994లో ట్రాన్స్‌కో లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జెన్‌లో ఏఈగా విధుల్లో చేరారు. మొదట శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఏఈగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నాగరాజారావు వైఎస్సార్ కడప జిల్లాతో పాటు కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పనిచేశారు. 2008లో ఏడీగా పదోన్నతి పొందిన ఆయన గుంటూరు, కృష్ణా, విజయవాడ, అనంతపురం జిల్లాల్లో పనిచేశారు. తరువాత 2022లో ఈఈగా పదోన్నతి పొందారు. ఆయనను ఇన్‌చార్జ్ ఈఈ సుధీర్ బాబు సాదరంగా ఆహ్వానించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఈ బీవీ.శ్రీనివాస్‌తో పాటు కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులను కూడా కలిశారు.

ఆర్టీసీ బస్టాండు స్థలాలు 15 ఏళ్ల లీజుకు

- 7 బస్టాండ్లలో స్థలాలకు అవకాశం

ఒంగోలు: ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను 15 ఏళ్లపాటు లీజుకు ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 వరకు దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తును ఈనెల 30న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోగా బిడ్లు నెల్లూరు జోన్ ఈడీ 3 కార్యాలయంలోని బాక్సులో వేయాలని, అనంతరం టెండరుదారుల సమక్షంలో ఓపెన్ చేయాలన్నారు. కనిగిరి బస్టాండ్, వై.పాలెం బస్టాండ్, పామూరు బస్టాండ్, కొండపి ఖాళీస్థలం, సింగరాయకొండలలో ఈ స్థలాలు ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 20వ తేదీ స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో జరిగే ముందస్తు అవగాహన సదస్సులో పాల్గొనవచ్చన్నారు.




ఒంగోలు చివుకుల వారి వీధిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద సహస్ర దీపాలంకరణ సేవ

భజే గణేశం..!

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాలలో గణనాథుని రోజుకో రీతిగా పూజిస్తున్నారు. ఒంగోలులోని చివుకులవారి వీధిలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ చేయగా, రాజాపానగల్ రోడ్డు 4వ లైను ఎక్స్‌టెన్షన్‌లో బిస్కెట్ ప్యాకెట్లతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

– సాక్షి, ఒంగోలు



ఒంగోలులో బిస్కెట్ ప్యాకెట్లతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

గురుకుల క్రీడా పాఠశాలలో చేరే విద్యార్థులకు ఆహ్వానం

యర్రగొండపాలెం: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో ఉన్న గురుకుల క్రీడా పాఠశాలలో చేరే విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను 5వ తరగతిలో 30 సీట్లు, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో 3 సీట్ల ప్రకారం ఖాళీగా ఉన్నాయని, అడ్మిషన్ల కోసం స్థానిక ఏపీ గిరిజన గురుకుల విద్యాలయం (పీటీజీ) బాలుర పాఠశాలలో ఈ నెల 17వ తేదీన ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఏపీలోని 3వ జోన్ పరిధిలో ఉన్న గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన గిరిజన గురుకుల, ప్రభుత్వ ఆశ్రమ, ఇతర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని చెప్పారు. విద్యార్థులు ఆయా పాఠశాలల్లోని ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్‌తో పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని, వివరాలకు సెల్ నంబర్: 95738 79433కు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

18న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం ఈ నెల 18వ తేదీ నిర్వహిస్తారని జెడ్పీ సీఈఓ కె. మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక ఆర్థిక విషయాలు, వ్యవసాయ విద్య వైద్యం స్థాయి కమిటీలు, మహిళ శిశు సంక్షేమ స్థాయి సాంఘిక సంక్షేమ స్థాయి కమిటీలు, పనుల స్థాయి కమిటీల పై అధికారులతో సమావేశం నిర్వహిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం జిల్లా పరిషత్ కార్యాలయం (సౌత్ బైపాస్ రోడ్డు) లో ఉంటుందని చెప్పారు. అధికారులందరూ సరైన నివేదికలతో హాజరుకావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర శుక్రవారం గరిష్టంగా కేజీ రూ.358 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. కందుకూరు 1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 149వ రోజు వేలం పాటలో 5685 బేళ్లు రాగా 4555 బేళ్లు కొనుగోలయ్యాయి. 1130 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.148, సరాసరి రూ.245.57 పలికింది.

నాలుగు రోజులుగా అంధకారంలో..

● తెగిన విద్యుత్ తీగలు మరమ్మతులు చేయని అధికారులు



కొండారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో తెగి పడిన విద్యుత్ తీగలు

హనుమంతునిపాడు: కొండారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేక అంధకారం నెలకొంది. నాలుగు రోజుల క్రితం ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలకున్న విద్యుత్ తీగలు తెగి నివాసాలపై, రోడ్డుపై పడ్డాయి. అధికారులు విద్యుత్ సరఫరా లేకుండా నిలిపారు. అప్పటి నుంచి విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయలేదు. రాత్రిపూట అంధకారంలో అవస్థలు పడుతున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని చెబుతున్నారు.


వినాయక నిమజ్జనాలను మెరైన్ డీఎస్పీ తనిఖీ



కొత్తపట్నం మెరైన్ పోలీసులకు సూచనలు ఇస్తున్న మెరైన్ డీఎస్పీ కె.బాలరాజు

కొత్తపట్నం: విశాఖపట్నం నుంచి వచ్చిన సౌత్ మెరైన్ డీఎస్పీ కె.బాలరాజు కొత్తపట్నం బీచ్‌లో జరిగే వినాయక నిమజ్జనాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. చీరాల ఓడరేవు నుంచి పాటిసుబ్బయ్యపాలెం, కొత్తపట్నం, మడనూరు వరకు బీచ్ ప్రాంతంలో పర్యటించారు. నిమజ్జనంలో విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులతో మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రాణ నష్టం జరగకుండా అలల మధ్య మెరైన్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. రక్షణగా లైఫ్‌జాకెట్స్, అలల మధ్య గస్తీ తిరగటానికి బోటును సిద్ధం చేసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనాలు అయిపోయేంత వరకు జాగ్రత్తలు తీసుకోవాలని మెరైన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సాధారణ తనిఖీలో భాగంగా మెరైన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెరైన్ పోలీస్ స్టేషన్ చుట్టూ చెట్లు పెంచడం, పరిశుభ్రంగా ఉండటం చూసి సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు ఉన్నారు.

పేదలపై ఎందుకంత కళ్ల మంట?



సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు బీరాలు పలికిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా వాటి అమలు ఊసే ఎత్తడం లేదు. ఖజానాలో నిధులు లేవని మూడు నెలలుగా కుంటి సాకులు చెబుతూ వస్తున్న సీఎం చంద్రబాబునాయుడు.. గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు మంగళం పాడటంలో మాత్రం ముందుంటున్నారు. 2017లో టీడీపీ హయాంలో ప్రారంభించి అమలులో చేతులెత్తేయగా.. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ యథావిధిగా కొనసాగించి పేదలకు మేలు చేసిన ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాలను కూడా కూటమి సర్కారు మూతవేసింది. దీంతో నేత్ర పరీక్షలు చేయించుకోలేక, కళ్లజోళ్లు పొందే అవకాశం కోల్పోయిన పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● నేత్ర పరీక్షల కేంద్రాలను చాపచుట్టేసిన కూటమి సర్కారు
● సీఎం ఈ ఐ కేంద్రాల సేవలు నిలిపివేత
● అప్తాల్మిక్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లు 250 మందికి ఉద్వాసన
● కళ్లజోడు నమోదు ప్రక్రియకు బ్రేక్
● ప్రభుత్వ నిర్ణయంతో నేత్ర బాధితుల అవస్థలు

కనిగిరి రూరల్:

పేద ప్రజలకు అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందించే ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాలపై కూటమి సర్కారు వేటు వేసింది. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(30 పడకల ఆస్పత్రులు)లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల్లో సేవలను హఠాత్తుగా నిలిపేయడంతో నేత్ర సంబంధిత బాధితులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేత్ర పరీక్షలు నిర్వహించడం, రెండు వారాల్లోగా నేరుగా ఇంటి వద్దకే కళ్ల జోళ్లు అందించే ప్రక్రియ నిర్విఘ్నంగా కొనసాగించగా.. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన మూడు నెలల్లోనే ఆ పథకానికి మంగళం పాడేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగుల కొనసాగింపుపై మౌనం

ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు చేసి, ఇతర సేవలు అందించేందుకు రాష్ట్రంలో 250 మందికి పైగా ఉద్యోగులను 2017లోనే ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించారు. వీరంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ కొనసాగారు. జిల్లాలో సుమారు 20 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ ఐ కేంద్రాలను టీడీపీ కూటమి ప్రభుత్వం మూత వేయడం ద్వారా కాంట్రాక్ట్ బేసిక్‌లో పనిచేస్తున్న ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్వాసన పలికింది. జిల్లాలో నేత్ర వైద్యులు దర్శి, గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్పా మిగిలిన చోట్ల లేరు. ప్రభుత్వ ఆఫ్తాలిక్ అసిస్టెంట్లు కొన్ని చోట్ల మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం నియమించిన ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్లు ఎక్కువ వైద్య శిబిరాల్లో ఉంటారు. గడిచిన ఏడేళ్లుగా నేత్ర వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగుల కొనసాగింపుపైనా సర్కారు మౌనం వహించడంతో వారిలో ఆందోళన మొదలైంది.

సేవలు నిలిపేయడంలో ఆంతర్యమేమిటో?

గ్రామీణ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేదలకు మేలు చేసే ఈ ఐ కేంద్రాల సేవలను నిలిపేయడంపై ఆయా వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోజూ 30 మంది వరకు ఓపీ నమోదు చేసుకుని సేవలు పొందుతున్నారు. కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూ 35 వరకు ఓపీలు నేత్ర సంబంధితమైనవే నమోదవుతున్నాయి. ఇక్కడ ప్రతి నెలా సుమారు 550 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేసేవారు. మిగిలిన సీహెచ్‌సీల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ఒక్కసారిగా సేవలు నిలిపేయడంతో నేత్ర రుగ్మతలతో బాధపడే వారంతా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చేతి చమురు వదిలించుకోలేక సతమతమవుతున్నారు.

బాబు రాగానే.. పథకం స్టాప్

వాస్తవానికి ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల ప్రాజెక్టును 2017లో టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరి, దర్శి, అద్దంకి, కొండపి, యర్రగొండపాలెం, చీమకూర్తి, మార్టూరు, గిద్దలూరులోని 30 పడకల ఆస్పత్రుల్లో ఏర్పాటైన ఈ కేంద్రాల్లో సేవలు నామమాత్రంగానే అందాయి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం ఈ ఐ కేంద్రాలకు సాంకేతికతను జోడించి మరింత మెరుగులు దిద్ది యథావిధిగా కొనసాగించారు. పేదలకు ఎంతగానో ఉపయోగపడిన ఈ పథకాన్ని 3 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిలిపేసింది. దీంతో నేత్ర సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



జగన్ ముందు చూపు

నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఉచిత వైద్యం అందించడంపై గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఏర్పాటు చేయడంతోపాటు సీఎం ఈ ఐ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక ఫండస్ మిషన్, ఏఆర్ మిషన్లు సమకూర్చారు. ఐ కేంద్రాల్లో ఒక ఆఫ్తాలిక్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వీరు పాల్గొని విశిష్ట సేవలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రెండు వారాల్లోగా కళ్లజోళ్లను ఆశా కార్యకర్తల ద్వారా నేరుగా ఇంటి వద్దే అందించారు. ఈ పథకం కింద గత ప్రభుత్వంలో జిల్లాలో వేలాది మందికి ఉచితంగా సేవలు అందాయి.



డీసీహెచ్ ఏమన్నారంటే?

నేత్ర వైద్య సేవల నిలిపివేతపై ఇన్‌చార్జి డీసీహెచ్ శేషుకుమార్‌ను వివరణ కోరగా.. 'రాష్ట్రం మొత్తం వివిధ ఆస్పత్రుల్లో కళ్లద్దాల పంపిణీ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఆగింది. గత నెలలో నమోదు చేసిన వారికి ఈనెల 15వ తేదీ కళ్లద్దాలు ఇస్తాం. ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం రెన్యువల్ చేయాల్సి ఉంది. జీవో వస్తే వారు కొనసాగుతారు. ప్రస్తుతానికైతే ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న సిబ్బంది ఆగినట్లే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

రెచ్చగొట్టి.. కేసులు పెట్టి..



పందివానిపల్లెలో వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడి చేస్తున్న పసుపు దండు



వైపాలెం : ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రభాకరరావు

● గణేశ్ నిమజ్జన వేడుకల్లో బరితెగించిన పసుపు దండు
● పందివానిపల్లెలో ఉద్దేశపూర్వకంగా రచ్చ చేసి కేసులు పెట్టిన టీడీపీ నేతలు
● అర్ధవీడు మండలం మాగుటూరులోనూ 15 మందిపై తప్పుడు కేసులు
● టపాసు తగిలి కర్టెన్‌కు చిల్లు పడితే దాడికి యత్నించారంటూ నీచ రాజకీయం

యర్రగొండపాలెం/బేస్తవారిపేట: సాఫీగా భక్తి శ్రద్ధలతో సాగాల్సిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో టీడీపీ శ్రేణులు బరితెగించి రచ్చ చేశాయి. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై తప్పుడు కేసులు పెట్టి వేధించేందుకు పావులు కదిపాయి. జిల్లాలో వరుసగా జరుగుతున్న సంఘటనలే అందుకు నిదర్శనం. దర్శి మండలం బండి వెలిగండ్లలో టీడీపీ శ్రేణులు చేసిన రచ్చ మరువక ముందే వైపాలెం, అర్ధవీడు మండలాల్లోనూ అదే తరహా సంఘటనలు చోటుచేసుకున్నాయి.

పసుపు చల్లి.. రచ్చరచ్చ

యర్రగొండపాలెం మండలంలోని పందివానిపల్లె గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఊరేగింపుగా వెళ్తూ ఆ గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద భారీగా టపాసులు కాల్చారు. టీడీపీ పాటలకు చిందులేస్తూ వైఎస్సార్ విగ్రహంపై, పక్కనే ఉన్న వైఎస్సార్ సీపీ వర్గీయులపై పసుపు చల్లారు. వారించబోయిన వైఎస్సార్ సీపీ శ్రేణులను మరింత రెచ్చగొట్టి ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్య హుటాహుటిన వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారు. శుక్రవారం కూడా టీడీపీ శ్రేణులు ఘర్షణకు దిగేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నాయకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. వర్గానికి 15 మంది చొప్పున ఒక్కొక్కరికి రూ.2 లక్షల పూచీకత్తుతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బైండవర్ అయిన వారు అల్లర్లకు పాల్పడితే రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తామని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల జోక్యం లేకుండా దేవుడి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని హితవు పలికారు.



అర్ధవీడులో తహసీల్దార్ వద్ద బైండోవర్ కేసులో హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఏమీ కాకపోయినా ఏదో జరిగిందని..

అర్ధవీడు(బేస్తవారిపేట): వినాయకుడి నిమజ్జన ఊరేగింపు సమయంలో దాడికి యత్నించారని, చంపుతామని బెదిరించారని తప్పుడు ఫిర్యాదు చేసి వైఎస్సార్ సీపీకి చెందిన 15 మందిపై వివిధ రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేయించారు. ఈనెల 11వ తేదీన అర్ధవీడు మండలంలోని మాగుటూరులో వైఎస్సార్ సీపీ శ్రేణులు, గ్రామస్తులు కొందరు కలిసి ఏర్పాటు చేసుకున్న వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లారు. రోడ్డుపై ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలో టపాసులు కాల్చారు. ఈ సమయంలో రహదారి పక్కనే ఉన్న టీడీపీ సానుభూతిపరుడు సుబ్బయ్య ఇంటి తలుపు కర్టెన్‌పై నిప్పు రవ్వ పడింది. కర్టెన్‌కు బెజ్జం మాత్రమే పడిన ఈ ఘటనకు అనూహ్యంగా రాజకీయ రంగు పులిమారు. టీడీపీ ముఖ్య నాయకుల ఒత్తిడితో.. మహిళ గాయపడినట్లు, చంపుతామని బెదిరించినట్లు, ఇంటిని తగలబెట్టడానికి ప్రయత్నించినట్లు, అవమానించినట్లు ఇలా పలు సెక్షన్ల కింద 12వ తేదీ రాత్రి కేసు నమోదు చేశారు. వాస్తవానికి గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పోలీసుల పర్యవేక్షణలోనే ఊరేగింపు నిర్వహించారు. ఇదే గ్రామంలో టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసుకున్న వినాయక విగ్రహాన్ని 10వ తేదీన రోడ్డుపై బాణాసంచా కాల్చుతూ టీడీపీ జెండాలు, పార్టీ పాటలు పెట్టి నిమజ్జనానికి తరలించారు. దీనిపై ఎవరూ ఎక్కడా అభ్యంతరం చెప్పలేదు. కానీ ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడం అర్ధవీడు మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు గ్రామంలోనే లేని వైఎస్సార్ సీపీ నాయకుడు నారు అశోక్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం టీడీపీ నేతల బరితెగింపునకు పరాకాష్టగా నిలిచింది. 12, 13వ తేదీల్లో వైఎస్సార్ సీపీ వర్గీయులను స్టేషన్‌కు పిలిపించి విచారించిన ఎస్సై సుదర్శన్ యాదవ్.. టీడీపీ నాయకుల ఒత్తిడితో గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. శుక్రవారం అర్ధవీడు తహసీల్దార్ కె.దాసు వద్ద బైండోవర్ చేశారు.

■ 'చిరు చిరు చిరు' గణనాథా..



గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని కోనేటి వీధిలో ఏర్పాటు చేసిన గజాననుడి విగ్రహమూర్తిని శుక్రవారం చిరు ధాన్యాల మొక్కలతో సుందరంగా అలంకరించారు. చెరకు గెడలు, జొన్న, సజ్జ చొప్పతో లంబోదరుడిని ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. స్వామివారిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. - మార్కాపురం టౌన్

వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందలేదు



ప్రకాశం సహాయనిధిని అందుకుంటున్న సీపీఐ రామకృష్ణ



బాధితులకు పంపిణీ చేస్తున్న సీపీ నాయకులు

● సీపీఐ నాయకుల విమర్శ
● విజయవాడలో రూ.5 లక్షల విలువైన సామాగ్రి పంపిణీ

ఒంగోలు సెంట్రల్: సీపీఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ వరద బాధితులకు రూ.5 లక్షల విలువైన బియ్యం, నూనె, దుప్పట్లు, కందువాలు తదితర సామగ్రిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామక్రిష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా సమితి పిలుపు మేరకు ప్రతి కార్యకర్త నిధి వసూలు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆధ్వర్యంలో విజయవాడ తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ బుడమేరు వరద తీవ్ర నష్టాన్ని, ఆవేదనను విజయవాడ ప్రజలకు మిగిల్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు స్పందించి సాయం అందించేందుకు ముందుకు వచ్చినా అవి పూర్తి స్థాయిలో బాధితులకు చేరలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే సాయం అందించక కేవలం లెక్కలు వేసేందుకు పరిమితమైనదని అన్నారు. సర్వం కోల్పోయిన వరద బాధితులకు అధిక మొత్తంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యకర్తల నిధిలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రకాశం బృందాన్ని అభినందించారు. జిల్లా ఇన్‌చార్జి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య, అక్కినేని వనజ, పీవీఆర్ చౌదరి, వై రవీంద్రబాబు, కె వీరా రెడ్డి, సయ్యద్ యాసిన్, కొత్త కోట వెంకటేశ్వర్లు, ఎంఏ సాలార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, విజయ, లక్ష్మి, రామయ్య, ఏఐవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, సయ్యద్ ఇఫ్రాజ్, ఇస్లాం, స్టాలిన్, కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.